సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 31 । అక్టోబర్ । 2023

రమణీయం.. 'వెంకన్న' రథోత్సవం

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం లింగన్నపేటలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి రథోత్సవం నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి మొక్కులు చెల్లించుకున్నారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ కరుణ, జెడ్పీటీసీ విజయస్వామి దర్శించుకోగా ఆలయ కమిటీ చైర్మన్ పాపారావు, ప్రతినిధులు జ్ఞాపికలు అందించి సన్మానించారు.



న్యూస్‌రీల్

అంగన్‌వాడీల్లో పిల్లల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న లక్ష్మీరాజం

ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లల సంఖ్య పెంచాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం అన్నారు. ముస్తాబాద్ మండలం గూడెం, ముస్తాబాద్ సెక్టార్‌లలో సోమవారం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. పిల్లల హాజరుశాతం, పెరుగుతున్న బరువు, నిత్యం అందిస్తున్న పౌష్టికాహారం విషయాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. కేంద్రాలకు వచ్చే పిల్లలకు పౌష్టికాహార లోపం లేకుండా చూడాలన్నారు. గుడ్లు, పాలు, భోజనాలను పారదర్శకంగా అందించాలని సూచించారు. సీడీపీవో ఆనందిని, ఫిర్యాదుల విభాగం కమిటీ చైర్మన్ జ్యోతి శుక్లా, డీహబ్ కోఆర్డినేటర్ రోజ, సఖీ కేంద్రం ఇన్‌చార్జి విజయ, సూపర్‌వైజర్లు కళావతి, అరవింద, టీచర్లు పాల్గొన్నారు.

సీనియారిటీ ప్రకారం ఎలక్షన్ డ్యూటీలివ్వాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: రానున్న ఎన్నికల్లో విధుల కేటాయింపులో అవకతవకలు జరిగాయని వెంటనే సరిచేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల భూపాల్‌రెడ్డి, దుమాల రాంనాథ్‌రెడ్డిలు కోరారు. ఈమేరకు సోమవారం డీఈవో రమేశ్‌కు వినతిపత్రాన్ని అందించి మాట్లాడారు. సీనియారిటీ ప్రకారం ఎన్నికల విధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జూనియర్లు పీవోలుగా ఉన్న చోట్ల సీనియర్లు ఏపీవోలుగా విధులు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల డ్యూటీ విధింపులో ఉద్యోగుల పేస్కేల్ ఆధారంగా బేసిక్ పే పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

కార్మికులను వెట్టి నుంచి విముక్తి చేయాలి



నిరసన తెలుపుతున్న శానిటేషన్ కార్మికులు


సిరిసిల్లటౌన్: జిల్లాసుపత్రిలో పనిచేసే శానిటేషన్ కార్మికులకు వెట్టిచాకిరి నుంచి విముక్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులతో కలిసి రెండుగంటల పాటు విధులు బహిష్కరించి ఆస్పత్రి ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ఆస్పత్రిలో 230 పడకలకు కేవలం 40 మంది మాత్రమే పారిశుధ్య కార్మికులున్నారని, వీరికి ఓవర్ డ్యూటీలతో అధికారులు నెట్టుకొస్తున్నారని ఆరోపించారు. ఆస్పత్రిలో కార్మికుల కొరతను అధికారులు ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదించకుండా కార్మికులపై అధిక పనిభారం రుద్దుతున్నారని తెలిపారు. సిబ్బందిని పెంచకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కోడం రమణ తదితరులు పాల్గొన్నారు.

యారన్ సబ్సిడీకి పోరాటం



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: బతుకమ్మ చీరలు నేసిన కార్మికులకు వెంటనే యారన్ సబ్సిడీ డబ్బులు చెల్లించాలని తెలంగాణ పవర్‌లూమ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్లలోని పార్టీ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2021కి సంబంధించిన సబ్సిడీ ఇంకా రాలేదన్నారు. కార్మికుల పోరాటంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని నవంబర్ 2న సిరిసిల్లలో జరిగే నిరసన దీక్షలో కార్మికులు పాల్గొనాలని కోరారు. నాయకులు కోడం రమణ, నక్క దేవదాసు, ఎలిగేటి రాజశేఖర్, సురేశ్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలను మోసం చేయడం కన్నా.. ఎన్నికల్లో ఓడిపోవడం మేలు
– స్టీవెన్‌సన్

మీకు తెలుసా?


అంతర్గాం నుంచి నలుగురు ఎమ్మెల్యేలు

జగిత్యాలరూరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే రాజకీయాలకు జగిత్యాల జిల్లాలోని అంతర్గాం గ్రామం పెట్టింది పేరు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన మాకునూరి ధర్మారావు 1962లో జగిత్యాల ఎమ్మెల్యేగా గెలుపొందారు. అలాగే 1985లో గొడిశెల రాజేశంగౌడ్, ఇదే గ్రామానికి చెందిన సుద్దాల దేవయ్య 1985లో చొప్పదండి ఎమ్మెల్యేగా, 2018లో జగిత్యాల ఎమ్మెల్యేగా మాకునూరి సంజయ్‌కుమార్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు.



మాకునూరి ధర్మారావు రాజేశంగౌడ్ సుద్దాల దేవయ్య సంజయ్‌కుమార్

ఓటు.. సత్యాగ్రహం ఈ రెండూ ప్రజల చేతిలో ఉన్న ఆయుధాలు
– మహాత్మ గాంధీ



నే'తల'రాత మార్చేది వారే!

- ప్రవాసుల వైపు.. పార్టీల చూపు..
- ఎన్నారై పాలసీ కోసం ప్రవాసుల పట్టు
- ప్రసన్నం చేసుకునేందుకు నాయకుల పాట్లు



గల్ఫ్ దేశంలోని వలస జీవులు(ఫైల్)

సిరిసిల్ల: తెలంగాణ శాసనసభకు జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో అన్ని పార్టీలకు విజయం సాధించడం ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపు, ఓటములను నిర్ణయించే శక్తి గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన ప్రవాసులకు ఉంది. పొట్టచేత పట్టుకుని ఉన్న ఊరిని, కన్న తల్లిదండ్రులను, కట్టుకున్న భార్యా పిల్లలను విడిచి వేల మైళ్ల దూరం వెళ్లి గల్ఫ్ ఎడారుల్లో శ్రమిస్తున్న వలస జీవులు, వారి కుటుంబసభ్యుల ఓట్లు ప్రస్తుత ఎన్నికల్లో ఎంతో కీలకమయ్యాయి. గల్ఫ్ దేశాల్లోని వలస జీవులను ప్రసన్నం చేసుకునేందుకు అన్ని పార్టీల నేతలు ఆరాటపడుతున్నాయి. ఆయా దేశాల్లో ఉండే వలస జీవులతో వివిధ పార్టీల నేతలు టచ్‌లో ఉన్నారు.

• ఎనిమిది నియోజకవర్గాల్లో ప్రభావం

గల్ఫ్ దేశాలైన దుబాయి, మస్కట్, బెహరైన్, సౌదీఅరేబియా, ఖత్తర్, కువైట్ దేశాల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సుమారు 1.20 లక్షల మంది ఉన్నారు. వీరంతా ప్రస్తుత ఎన్నికల్లో ఓటర్లు కాగా.. వారి కుటుంబ సభ్యులు, ఆత్మీయులు కలిపి మొత్తంగా మరో నాలుగు లక్షల మంది ఉంటారు. సిరిసిల్ల, వేములవాడ, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, మానకొండూరు, హుజూరాబాద్, చొప్పదండి నియోజకవర్గాల్లో గల్ఫ్ వలస జీవులు అధికంగా ఉన్నారు. వీరు ఎన్నికల సమయంలో ఓటు హక్కు వినియోగించుకోకపోయినా.. కుటుంబసభ్యులకు ఏ పార్టీకి, ఏ గుర్తుకు ఓటు, ఎందుకు ఓటు వేయాలో వలస కార్మికులు చైతన్యవంతంగా చెబుతారు. దీంతో వారి కుటుంబసభ్యులు తూచా తప్పకుండా పాటిస్తారు. ఎన్నికల్లో వీరి ప్రభావం తీవ్రంగా ఉంటుంది.

• స్వరాష్ట్రంలోనూ తీరని కష్టాలు

తెలంగాణ రాష్ట్రం వచ్చినా గల్ఫ్ కార్మికుల కష్టాలు తీరలేదు. నిజానికి చదువు రాని వారు, అక్కడి భాష తెలియని వారు గల్ఫ్ దేశాలకు వెళ్లి అనేక ఇబ్బందులు పడుతున్నారు. గల్ఫ్ ఏజెంట్ల మాయమాటలతో వివిధ దేశాలకు వెళ్తున్న కార్మికులు అక్కడ ఏజెంట్ చెప్పినట్లు ఏ ఒక్కటీ లేక నానా కష్టాలు పడుతున్నారు. అప్పులు చేసి వెళ్లిన ఇంటికి వచ్చేందుకు భయపడుతూ వేతనాలు సరిగా రాక కష్టాలకు ఎదురీదుతున్నారు. అనేక అనేక కారణాలతో ఏటా గల్ఫ్ దేశాల్లో 300 మంది జిల్లావాసులు మరణిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 287 మంది గల్ఫ్‌లోని వివిధ దేశాల్లో మరణించారు. వారి శవం స్వగ్రామంలోని ఇల్లు చేరడం కష్టంగా ఉంది. విషాధ సమయాల్లో వలస జీవుల కుటుంబాల వేదన వర్ణనాతీతం.

ఏదీ ఎన్నారై పాలసీ

గల్ఫ్ దేశాల్లోని వలస జీవులు మాత్రం తెలంగాణ ప్రవాసుల కోసం ప్రత్యేకమైన ఎన్నారై పాలసీ ప్రకటించాలని కోరుతున్నారు. ప్రభుత్వంలో ఎన్నారై విభాగాన్ని ఏర్పాటు చేసి కమిషనర్‌ను నియమించాలని కోరుతున్నారు. కేరళ తరహాలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి వలస జీవుల యోగ క్షేమాలను సమీక్షించాలని, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అకారణంగా గల్ఫ్ జైళ్లలో మగ్గుతున్న వారికి న్యాయపరమైన సహకారం అందించాలని కోరుతున్నారు.

గల్ఫ్ జీవుల దీవెనలు ఎవరికో..?

ఈసారి ఎన్నికల్లో ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బరిలో దిగాయి. ఆయా పార్టీలు అభ్యర్థులను కూడా ప్రకటించాయి. ఎన్నికల్లో పోటీకి నామినేషన్ల గడువు సమీపిస్తున్న పరిస్థితుల్లో గల్ఫ్ వలస జీవుల దీవెనలు ఎవరికి ఉంటాయనేది ఆసక్తిగా మారింది.

గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఏటా రూ.కోట్లాది విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించి పెడుతున్న గల్ఫ్ కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదు. ఎన్నారై పాలసీ కోసం ఎప్పటి నుంచో కోరుతున్నా. కేరళ తరహా విధానంపై అధ్యయనం చేసి వదిలేశారు. రూ.100 కోట్ల నిధితో కూడిన ఎన్నారై పాలసీ అమలు చేయాలి.
– తోట ధర్మేందర్, పోత్గల్, రాజన్న సిరిసిల్ల

సంక్షేమ బోర్డుతో కూడిన పాలసీ కావాలి



నేను 12 ఏళ్లు ఖత్తర్ వెళ్లా. వలస కార్మికుల జీవనం గల్ఫ్ దేశాల్లో దారుణంగా ఉంటుంది. ఇక్కడ ఉపాధి అవకాశాలు లేకనే ఆయా దేశాలకు వెళ్తున్నారు. అలాంటి వారి సంక్షేమ బోర్డుతో కూడిన ఎన్నారై పాలసీ కావాలి. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయాలపై వలస జీవులు ఎక్కడ ఉన్నా నిశితంగా పరిశీలిస్తున్నారు.
– రవిగౌడ్, భీమారం, జగిత్యాల

చిక్కుతున్న అవినీతి చేపలు

- గాలమేస్తున్న ఏసీబీ అధికారులు
- కాసులకు కక్కుర్తి.. పెచ్చుమీరిన అవినీతి
- అవినీతిపరుల గుండెల్లో ఏసీబీ వణుకు
- పట్టుబడుతున్నా మారని అధికారుల తీరు



ఏసీబీకి చిక్కిన జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఉపేందర్‌రావు

సిరిసిల్ల: పౌర సమాజాన్ని లంచాల కోసం వేధిస్తున్న అవినీతి చేపలు చిక్కుతున్నాయి. కాసులకు కక్కుర్తి పడుతూ అవినీతికి పాల్పడే అధికారుల ఆటలను అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు కట్టడిచేస్తున్నారు. లంచావతారాలు అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ కాసులకు చేయిచాస్తూ కటకటాల పాలవుతున్నారు. నిబంధనల ప్రకారం చేయాల్సిన పనులకు డబ్బులను డిమాండ్ చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సోమవారం జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఉపేందర్‌రావు రూ.13వేలు లంచం తీసుకుంటూ.. అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడడం చర్చనీయాంశమైంది.

సబ్సిడీ టిప్పర్ కోసం లంచం

వీర్నపల్లి మండలం అడవి పదిరకు చెందిన భూక్యా సరిత టిప్పర్ కోసం దరఖాస్తు చేసింది. ప్రభుత్వం ద్వారా సబ్సిడీ వస్తుందనే ఆశతో జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా హైదరాబాద్‌లోని పరిశ్రమలశాఖ కమిషనర్ ఆఫీస్‌కు దరఖాస్తును పంపాలని కోరింది. రూ.30వేలు లంచంగా ఇస్తేనే పంపిస్తానని పరిశ్రమలశాఖ జీఎం ఉపేందర్‌రావు తెలిపారు. ఈ మేరకు అక్టోబరు 26న రూ.17వేలు ఉపేందర్‌రావుకు అందించారు. మిగితా రూ.13వేలు ఇవ్వాలని మళ్లీ డిమాండ్ చేయడంతో సరిత ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సరిత మరిది విజయ్‌కుమార్ పరిశ్రమల శాఖ జీఎం ఉపేందర్‌రావుతో ఫోన్‌లో మాట్లాడి రూ.13వేలు ఎక్కడ ఇవ్వాలని అడుగ్గా.. సిరిసిల్ల గీతానగర్ హైస్కూల్ వద్దకు వచ్చి ఇవ్వాలని సూచించాడు. ఈమేరకు విజయ్‌కుమార్ నుంచి రూ.13వేలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.

గతంలోనే కలెక్టర్‌కు ఫిర్యాదు

జిల్లా పరిశ్రమల శాఖలో అవినీతి జరుగుతుందని ముస్తాబాద్ మండలం తుర్కపల్లెకు చెందిన చింతకింది సుధీర్ గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. టీ–ప్రైడ్‌లో సబ్సిడీ ట్రాక్టర్ కోసం దరఖాస్తు చేయగా ఆన్‌లైన్ చేసేందుకు పరిశ్రమల శాఖ ఆఫీస్‌లో రూ.2,500 కృష్ణ, కిశోర్ అనే అధికారులు అడిగారని సుధీర్ ఫిర్యాదు చేశారు. ఇలాంటి ఫిర్యాదులున్నా పరిశ్రమల శాఖ ఆఫీస్‌పై నియంత్రణ లేక పోవడంతో ఏకంగా ఆ శాఖ జిల్లా అధికారి ఏసీబీకి పట్టుబడ్డారు.

డబ్బులు డిమాండ్ చేశారు



సబ్సిడీ టిప్పర్ కోసం అన్ని పత్రాలు సమర్పించాం. మా దరఖాస్తును పంపకుండా ఆపేసి రూ.30వేలు ఇస్తేనే పంపిస్తా అన్నారు. ముందుగా రూ.17వేలు ఇచ్చినం. మిగితా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించాం. మాలాంటి పేదోళ్లను వేధించడం సరికాదు.
– భూక్యా విజయ్‌కుమార్, బాధితుడు

నిర్భయంగా ఫిర్యాదు చేయండి



లంచాల కోసం ఎవరు వేధించినా నిర్భయంగా ఫిర్యాదు చేయండి. అవినీతిని అరికట్టేందుకు ఏసీబీకి సహకరించాలి. మా సెల్ నంబర్ 91543 88954ను సంప్రదించవచ్చు.
– వీవీ.రమణమూర్తి, ఏసీబీ డీఎస్పీ

నిబంధనల మేరకు ఎన్నికలు నిర్వహించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో ఎన్నికలను ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సిరిసిల్ల జెడ్పీ స్కూల్‌లో సోమవారం ఎన్నికల ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణపై సంపూర్ణ అవగాహన ఉంటే పారదర్శకంగా సజావుగా నిర్వహించవచ్చన్నారు. హ్యాండ్‌బుక్ ఫర్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్–2023 పుస్తకంలోని నిబంధనలను జాగ్రత్తగా చదవాలని సూచించారు. గత ఎన్నికల సమయంలో ఎదురైన సమస్యలు, అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పునరావృతం కాకుండా చూడాలన్నారు. పోలింగ్ రోజు ఏమైన సందేహాలు ఉంటే సెక్టార్ అధికారులకు తెలియజేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఎస్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, ప్రత్యేక ఉపకలెక్టర్ బి.గంగయ్య, సీపీవో శ్రీనివాసచారి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదును పూర్తి చేయాలి

ఓటర్ల నమోదును పూర్తి చేయాలని సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్‌వ్యాస్ కోరారు. సోమవారం న్యూఢిల్లీ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, స్వీకరణ సమయంలో సమయపాలన పాటించాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతీ అభ్యర్థికి తప్పనిసరిగా ఓటరు జాబితా వివరాలు అందించాలని సూచించారు. స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించే సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రతిపైసా లెక్కించాలి

ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి పైసాను లెక్కించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యయలెక్కింపు బృందాలకు మరోసారి శిక్షణ ఇవ్వాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఓటు నమోదుకు వచ్చిన అన్ని ఫారాలను క్లియర్ చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఎన్.ఖీమ్యానాయక్, బి.గౌతమ్ రెడ్డి, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, జిల్లా ఆడిట్ అధికారి స్వప్న, డీఈవో రమేశ్‌కుమార్, డీపీవో రవీందర్, డీటీవో కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యాసంగి పంటల సాగు ఖరారు

- ప్రణాళిక సిద్ధం చేసిన వ్యవసాయాధికారులు
- జిల్లాలో 1,81,622 ఎకరాల్లో సాగు అంచనా



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

చందుర్తి(వేములవాడ): జిల్లాలో యాసంగి పంటల సాగు ప్రణాళికను జిల్లా వ్యవసాయాధికారులు ఖరారు చేశారు. ఈసారి గత యాసంగి కన్న 500 ఎకరాల విస్తీర్ణంలో తక్కువగా వరిసాగు చేయనున్నట్లు అంచనా వేశారు. జిల్లావ్యాప్తంగా 1,81,622 ఎకరాల్లో పంటలు సాగు చేస్తుండగా.. ఇందులో 1,73,100 ఎకరాల్లో వరి సాగు చేయనున్నట్లు అంచనాలు సిద్ధం చేశారు. వరిసాగుపై ఆంక్షలు లేకపోవడంతో పాటు భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడంతో రైతులు వరిసాగుపై మక్కువ చూపుతున్నారు. యాసంగి పంటల సాగుకు 75వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉండగా.. ప్రస్తుతం 18వేల మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయాధికారుల రికార్డులు చెబుతున్నాయి. రైతులకు అందుబాటులో సరిపడా ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు మండలాల వారీగా సాగు లెక్కల ప్రకారం సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే శనగలు, పెసర్లు, వెరుశనగ, ఆరుతడి పంటల సాగుకు విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అంతేకాకుండా ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలను మండల కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. రైతులు ఆరుతడి పంటలను నవంబర్ రెండో వారం లోపు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని అంటున్నారు.

వరి సాగుపైనే అన్నదాత ఆసక్తి

జిల్లాలోనే రైతాంగం ఇతర పంటల సాగు కన్న వరి సాగుపైనే ఆసక్తి చూపుతున్నారు. చెరువులు, కుంటలు నీటితో నిండుగా ఉన్నాయి. సెప్టెంబర్ నెల చివరి వరకు భారీగా వర్షాలు పడడంతో భూగర్భ జలాలు పైపైనే ఉన్నాయి. ఇతర పంటల కన్న వరి సాగు చేస్తే నాట్లు వేసేటప్పుడు తప్పా.. మిగతా సమయాల్లో కూలీ అవసరం లేక పోవడంతో వరిసాగు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుందన్న ఆశతో వరిసాగును ఎంచుకుంటున్నారు.

పంటల సాగు విధానం ఇలా..

పంటలు	గతేడాది ఎకరాల్లో..	ఈ యేడాది ఎకరాల్లో..
వరి	1,73,600	1,73,100
మొక్కజొన్న	1,750	1,014
గోధుమ	80	240
పొద్దు తిరుగుడు	1,110	303
వేరుశనగ	395	65.12
శనగ	765	392
ఇతర పంటలు	28	221
కూరగాయలు	–	545
పండ్ల తోటలు	–	5,742
హర్టికల్చర్	–	6,287

కొరత లేకుండా చూస్తాం

యాసంగి పంటలు సాగు చేసే రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా సిద్ధం చేశాం. వరితో పాటు ఆరుతడి పంటలుగా నువ్వు, పొద్దు తిరుగుడు, మొక్కజొన్న, పెసర, శనగ, వేరుశనగ పంటల సాగు చేయనున్నారు. పండ్ల, హర్టికల్చర్ సాగు గతంలో కంటే మూడింతలు పెరిగింది.
– భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి, రాజన్న సిరిసిల్ల జిల్లా

అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తా




ఆరు గ్యారంటీలపై వివరిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: వేములవాడలోనే అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేసి చూపిస్తానని ఆది శ్రీనివాస్ అన్నారు. గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని సుబ్రమణ్యంనగర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తనను గెలిపిస్తే వెనుకబడిన వేములవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని, రాజన్న గుడిని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు ఉన్నారు.

జంగ్ తెలంగాణ

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా అలీ బేగ్



మీర్జా ఫసహత్ అలీ బేగ్

సిరిసిల్లటౌన్: కలెక్టర్ అనురాగ్ జయంతి ఉత్తర్వుల మేరకు సిరిసిల్ల మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా మీర్జా ఫసహత్ అలీ బేగ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయాజ్ దీర్ఘకాలిక సెలవులో ఉండటంతో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అన్సార్ నియమితులయ్యారు. కాగా కొద్ది రోజుల వ్యవధిలోనే ఆయన స్థానంలో మున్సిపల్ మేనేజర్‌గా పనిచేస్తున్న మీర్జా ఫసహత్ అలీబేగ్‌ను నియమించగా ఆయన ప్రస్తుతం సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే తెలంగాణ ఆగమవుతుంది



ప్రచారం చేస్తున్న వినోద్‌కుమార్, లక్ష్మీనర్సింహరావు

రుద్రంగి(వేములవాడ): కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే తెలంగాణ ఆగమవుతుందని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం రుద్రంగి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహరావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా బీఆర్‌ఎస్ కరపత్రాలు పంచుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఇందిరాచౌక్, హనుమాన్ ఆలయం మీదుగా అంబేడ్కర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి మహిళలు మంగళహారతులు, బోనాలు, బతుకమ్మలు, డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయానికి మూడు గంటల కరెంటు అంటున్న కాంగ్రెస్ కావాలా? 24 గంటల నిరంతర విద్యుత్ ఇస్తున్న బీఆర్‌ఎస్ కావాలా? రైతులు ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీఆర్‌ఎస్ మండల, గ్రామ శాఖల అధ్యక్షులు దెగావత్ తిరుపతి, దయ్యాల కమలాకర్, బీఆఎస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కవయిత్రికి సన్మానం



రాజ్యలక్ష్మీని సన్మానిస్తున్న గోపాల ఆచార్య

గంభీరావుపేట(సిరిసిల్ల): కలం స్నేహం సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో యాదాద్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి శతాధిక కవి సమ్మేళనంలో గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన కవయిత్రి ఆకుల రాజ్యలక్ష్మీ సాహితీ సన్మానం పొందారు. యాదాద్రి ప్రాశస్త్యంపై రాసిన కవితలకు సన్మానం లభించింది. సినీ గేయ రచయిత, సంగీత దర్శకుడు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గోపాల ఆచార్య ఆమెకు జ్ఞాపికను అందించి సత్కరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. సింగారంకు చెందిన సూర నవీన్ తన వాహనంలో గొల్లపల్లికి ఇసుకను తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో దాడి చేసి పట్టుకున్నారు. అనుమతి పత్రాలను పరిశీలించగా లేవని చెప్పడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మేకల దొంగల రిమాండ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగుండారం నివాసి లాల ఎల్లయ్యకు చెందిన మేకలను ఈనెల 10న దొంగిలించిన సంఘటనలో ఇద్దరిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లయ్య తన మేకలను షెడ్డులో కట్టివేసి ఉంచగా ఈనెల 10న కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చపేటకు చెందిన ముజరేకర్ ప్రశాంత్, చల్ల నవీన్ అనే వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై ఎల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా గాలించి మేకల దొంగలను పట్టుకున్నారు. దొంగలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

కెనాల్‌లో దూకి యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం: కెనాల్‌లో దూకి ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్‌త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. సీఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. నగరంలోని మారుతినగర్ చెందిన బొమ్మ నాగరాజు(29) కొరియర్ బాయ్‌గా పని చేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 23న భార్యాపిల్లలను తీసుకొని, అత్తగారింటికి వెళ్లాడు. 25న ఒక్కడే తిరిగి కరీంనగర్ వచ్చాడు. 28న సాయంత్రం భార్యకు ఫోన్ చేసి, రావాలన్నాడు. కానీ, ఆమె 29న సాయంత్రం పిల్లలతో వచ్చి, భర్తకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసినవారిళ్లలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం మధ్యాహ్నం తిమ్మాపూర్ మండలంలోని అల్గునూర్ కెనాల్ వద్ద నాగరాజు ద్విచక్రవాహనాన్ని గుర్తించారు. హుజూరాబాద్ సమీపంలోని నర్సింగాపూర్ ఎస్సారెస్పీ కెనాల్లో అతని మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే నాగరాజు ఆత్మహత్య చేసుకొని ఉంటాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

జగిత్యాలలో యువకుడు..

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని అరవింద్‌నగర్‌కు చెందిన ద్యావనపల్లి మహేశ్(27) ఆత్మహత్య చేసుకున్నాడు. జగిత్యాల పట్టణ ఏఎస్సై వేణురావు వివరాల ప్రకారం.. మహేశ్ ప్రభుత్వ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అతనికి కొన్నేళ్లుగా మానసిక స్థితి సరిగా ఉండటం లేదు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు.

స్వతంత్రుల కార్మిక క్షేత్రం



- నాలుగు దశాబ్దాలు.. 14సార్లు ఎన్నికలు • గెలుపోటములను ప్రభావితం చేస్తున్న కార్మికులు


కోరుకంటి చందర్


కొప్పుల ఈశ్వర్


సత్యనారాయణ


మాలెం మల్లేశం


మాతంగి నర్సయ్య



గోదావరిఖని: పునర్విభజనకు ముందు మేడారం (ఎస్సీ) నుంచి పునర్విభజన తర్వాత రామగుండం (జనరల్) అసెంబ్లీ నుంచి బరిలో దిగిన స్వతంత్ర అభ్యర్థులకూ నియోజకవర్గ ఓటర్లు పట్టం కడుతూ వస్తున్నారు. మేడారం నుంచి ఎం.రామ్‌గోపాల్ రెడ్డి, మాలెం మల్లేశం స్వతంత్రులుగా బరిలో దిగి విజయం సాధించారు. పునర్విభజన తర్వాత రామగుండం నుంచి ప్రధాన పార్టీలతో పోటీపడిన సోమారపు సత్యనారయణను కూడా ఓటర్లు తమ అక్కున చేరుకున్నారు. ఇక గతఎన్నికల్లో రామగుండం అసెంబ్లీ నుంచి ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి కోరుకంటి చందర్ విజయం సాధించారు. సమీప బీఆర్ఎస్ అభ్యర్థి సోమారపు సత్యనారాయణపై 26,332 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ మూడోస్థానంలో నిలిచారు.

మేడారం నుంచి రామగుండం దాకా..

- రామగుండం పారిశ్రామిక ప్రాంతం గతంలో మేడారం(ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గంలో ఉండేది.
- నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా రామగుండం కార్పొరేషన్‌తోపాటు పాలకుర్తి, అంతర్గాం, రామగుండం మండలాలను కలుపుకుని 2009లో రామగుండం(జనరల్) 23వ అసెంబ్లీ నియోజకవర్గంగా ఆవిర్భవించింది.
- గోదావరిఖని కార్మిక క్షేత్రమే ప్రధాన కేంద్రంగా ఏర్పడింది.
- రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాల్లోని 266 గ్రామాలు, రామగుండం కార్పొరేషన్‌లోని 50 డివిజన్లు అసెంబ్లీ పరిధిలోకి వచ్చాయి.
- సింగరేణి, ఎన్టీపీసీ, ఏపీ జెన్‌కో, కేశోరామ్ సిమెంట్, ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమలు ఇక్కడి ప్రత్యేకత.
- సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, వారికుటుంబాల ప్రభావం అభ్యర్థుల గెలుపోటములపై తీవ్రప్రభావం చూపుతున్నాయి.
- నియోజకవర్గంలో ప్రస్తుతం 2,14,974మంది ఓటర్లు ఉన్నారు.
- వీరిలో సుమారు లక్ష వరకు కార్మికులు, వారి కుటుంబాలుంటాయి.
- 2009లో ఇండిపెండెంట్‌గా, 2014లో బీఆర్ఎస్ నుంచి సోమారపు సత్యనారాయణ ఎమ్మెల్యేగా రెండుసార్లు విజయం సాధించారు.

ఈసారి చందర్ వర్సెస్ ఠాకూర్..

కోరుకంటి చందర్ 2018లో ఇండిపెండెంట్‌గా సింహం గుర్తుపై పోటీచేసి విజయం సాధించారు. టీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ ఓటమి పాలయ్యారు. ఈసారి నవంబర్‌లో జరిగే ఎన్నికల్లో ప్రధానంగా బీఆర్ఎస్ నుంచి కోరుకంటి చందర్, కాంగ్రెస్ నుంచి ఎంఎస్ రాజ్ ఠాకూర్ మధ్య పోటీ ఉండే అవకాశం ఉంది. బీజేపీ నుంచి కందుల సంధ్యారాణి, ఇండిపెండెంట్‌గా సోమారపు సత్యనారాయణ బరిలో నిలవనున్నారు.

నాలుగు దశాబ్దాల తర్వాత జనరల్..

- 1957లో జనరల్‌గా ఉన్న మేడారం నియోజకవర్గంలో పీడీఎఫ్ తరఫున జి.లక్ష్మారెడ్డి, 1962లో స్వతంత్ర అభ్యర్థిగా ఎం.రాంగోపాల్‌రెడ్డి విజయం సాధించారు.
- 1967లో ఎస్సీకి కేటాయించారు.
- ఆనాడు గడిపెల్లి రాములు(కాంగ్రెస్) విజయం సాధించగా, 1972, 1978లో జి.ఈశ్వర్(కాంగ్రెస్) ఎన్నికయ్యారు.
- ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన తర్వాత 1983లో జరిగిన ఎన్నికల్లో మాతంగి నర్సయ్య(టీడీపీ) కాంగ్రెస్ కంచుకోటకు బీటలు కొట్టి గెలుపొందారు.
- ఇదే సమయంలోనే నాదెండ్ల భాస్కర్‌రావు మంత్రివర్గంలో నెలపాటు మంత్రిగా పనిచేశారు.

అయితే 1985లో ఆయనకు టికెట్ ఇవ్వకుండా సింగరేణి కార్మికుడు మాలెం మల్లేశం(టీడీపీ)కు టికెట్ ఇవ్వగా మల్లేశం ఘనవిజయం సాధించారు.

- 1989లో కాంగ్రెస్ నుంచి మాతంగి నర్సయ్య, 1994లో స్వతంత్ర అభ్యర్థిగా మాలెం మల్లేశం, 1999లో టీడీపీ నుంచి మాతంగి నర్సయ్య గెలుపొందారు.
- బీఆర్ఎస్ ఆవిర్భవించాక 2004లో జరిగిన ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్ ఆ పార్టీ తరఫున పోటీచేసి విజయం సాధించారు.
- నియోజకవర్గాల పునర్విభజనలో 42 ఏళ్ల తర్వాత మేడారం(ఎస్సీ)ని తొలగించి రామగుండం నియోజకవర్గం(జనరల్)గా మార్పుచేశారు.
- దీంతో అంతకుముందు మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన సోమారపు సత్యనారాయణ రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

నాలుగుసార్లు స్వతంత్రులకే పట్టం..

నియోజకవర్గంలో కార్మికులు, వారి కుటుంబాల ఓట్లే అత్యధికంగా ఉన్నాయి. వీరి ఓట్లే అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేస్తున్నాయి. మేడారం నియోజకవర్గంలో 11సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. నాలుగుసార్లు కాంగ్రెస్, మూడుసార్లు టీడీపీ, ఒకసారి పీడీఎఫ్, ఒకసారి టీఆర్ఎస్, మూడుసార్లు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. 2009లో రామగుండం అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కూడా స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన సోమారపు సత్యనారాయణను ఎన్నుకుని ఓటర్లు విలక్షణ తీర్పు ఇచ్చారు. 2018లో జరిగిన ఎన్నికల్లో సింహం గుర్తుపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన కోరుకంటి చందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించారు. గెలిచిన తర్వాత చందర్ అప్పటి టీఆర్ఎస్‌లో చేరారు.

మేడారం(ఎస్సీ) అసెంబ్లీ

పదవీకాలం	ఎమ్మెల్యే	పార్టీ
1957–62	జి.లక్ష్మారెడ్డి	పీడీఎఫ్
1962–67	ఎం.రాంగోపాల్‌రెడ్డి	స్వతంత్ర
1967–72	నడిపెల్లి రాములు	కాంగ్రెస్
1972–78	జి.ఈశ్వర్	కాంగ్రెస్
1978–83	జి.ఈశ్వర్	కాంగ్రెస్
1983–85	మాతంగి నర్సయ్య	టీడీపీ
1985–89	మాలెం మల్లేశం	టీడీపీ
1989–94	మాతంగి నర్సయ్య	కాంగ్రెస్
1994–99	మాలెం మల్లేశం	స్వతంత్ర
1999–2004	మాతంగి నర్సయ్య	టీడీపీ
2004–09	కొప్పుల ఈశ్వర్	టీఆర్ఎస్

రామగుండం అసెంబ్లీ (జనరల్)

పదవీకాలం	ఎమ్మెల్యే	పార్టీ
2009–2014	సోమారపు సత్యనారాయణ	స్వతంత్ర
2014–2018	సోమారపు సత్యనారాయణ	టీఆర్ఎస్
2018–2023	కోరుకంటి చందర్	ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్

రామగుండం సమాచారం

జనాభా	2,93,085
ఓటర్లు	2,14,974
పురుషులు	1,08,233
మహిళలు	1,06,716
థర్డ్‌జెండర్	25

మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన అన్నల్‌దాస్ వేణు, బీజేవైఎం నాయకులు

సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన పలువురు బీజేపీ, బీజేవైఎం నాయకులు సోమవారం హైదరాబాద్‌లో మంత్రి కె.తారక రామారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేశారు. సిరిసిల్ల నుంచి బస్సులో వెళ్లిన నాయకులకు హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో మంత్రి కేటీఆర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ అన్నల్‌దాస్ వేణు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండా ప్రతాప్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కంచర రవిగౌడ్, బీజేపీ తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు సురువు వెంకటి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బూర విష్ణు, బీజేవైఎం సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు మల్లడపేట భాస్కర్, బీజేపీ దళిత నాయకులు కంసాల మల్లేశం, బీజేవైఎం పట్టణ నాయకులు సిరిసిల్ల సాయికృష్ణ, గడ్డం హరీశ్, ఎలగం అభిలాశ్, నేరెళ్ల శ్రీధర్, కాసర్ల ప్రసాద్, బొల్లి నవీన్, రచ్చ రాహుల్, బాల్యాల జనార్దన్‌తో పాటు పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చీటీ నర్సింగరావు, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, దిడ్డి శ్రీనివాస్, మ్యాన రవి, ఎండీ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న రూరల్ సీఐ సదన్‌కుమార్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఎన్నికల్లో ఎటువంటి భయభ్రాంతులు, ప్రలోభాలకు గురవకుండా స్వేచ్ఛాయుతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ అన్నారు. సోమవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలో పోలీసులు, కేంద్ర బలగాలు సంయుక్తంగా నిర్వహించిన కవాతులో పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు ఎంతో ముఖ్యమైందని అటువంటి హక్కును ప్రతిఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. ఎవరైనా తమకే ఓటు వేయాలని ప్రలోభాలు, ఒత్తిళ్లకు గురిచేస్తే సమాచారం అందించాలని, వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఇల్లంతకుంట ఎస్సై దాస సుధాకర్, పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



సుద్దాలలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కోనరావుపేట: మండలం సుద్దాల, నిజామాబాద్, మల్కపేట, ధర్మారం గ్రామాల్లో ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో కేంద్రబలగాలు సోమవారం సాయంత్రం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలన్నారు.

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత



తల్లిదండ్రులతో బాలుడు శివారెడ్డి

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు సిద్దిపేట నుంచి వచ్చిన నరేందర్–రమ్య దంపతుల ఐదేళ్ల కుమారుడు శివారెడ్డి సోమవారం తప్పిపోయాడు. గమనించిన స్థానికులు బాలుడిని స్థానిక పోలీసులకు అప్పగించారు. పోలీసులు రాజన్న మైక్ ద్వారా ప్రచారం చేసి వాట్సాప్ గ్రూపుల్లోనూ పోస్టులు పెట్టారు. వెంటనే తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని బాలుడిని చేరదీసుకున్నారు. తప్పిపోయిన తన కుమారుడిని సేఫ్‌గా అప్పగించిన పోలీసులకు ఆ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీకి రాజీనామా

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బీజేపీ తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు సురువు వెంకట్ పార్టీకి రాజీనామా చేసినట్లు సోమవారం ప్రకటించారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా స్థానికులకు కాకుండా వలసవచ్చిన వారికి టికెట్ ఇవ్వడంపై నిరసనగా పార్టీని వీడినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులే గెలిపిస్తాయి

- టిస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు



మాట్లాడుతున్న కొండూరి రవీందర్‌రావు

వీర్నపల్లి(సిరిసిల్ల): తొమ్మిదేళ్ల పాలనలో టీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయని టిస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. సోమవారం వీర్నపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతనం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి కేటీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలతోపాటు అభివృద్ధి పనులను ఇంటింటా వివరించాలని సూచించారు. రానున్న కాలంలో మండలాన్ని అభివృద్ధి పథంలోనడిపించేలా యువత సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ మాలోతు భూల, జెడ్పీటీసీ కళావతి, సెస్ డైరెక్టర్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ప్యారాచూట్ లీడర్లకు పట్టం కట్టడం సరికాదు



రాజీనామాపత్రాలు చూపుతున్న బీజేపీ నేతలు

సిరిసిల్లటౌన్: బీజేపీ సిద్ధాంతాలు నమ్మి పనిచేసే వారిని కాదని ప్యారాచూట్ లీడర్లకు పట్టం కట్టడం సరికాదని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, లీగల్‌సెల్ రాష్ట్ర నాయకుడు అన్నల్‌దాస్ వేణు అన్నారు. సిరిసిల్ల నుంచి బీజేపీ ఎమ్మెల్యే టికెట్‌ను రాణిరుద్రమను ప్రకటించడంపై స్థానిక నాయకులు, కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. సోమవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదిహేనేళ్లుగా పార్టీకోసం పనిచేసిన వాళ్లను కాదని సిరిసిల్లకు ముక్కు, ముఖం తెలియని వారికి టిక్కెట్లు ఇవ్వడం ఏమిటన్నారు. నిజానికి రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్‌ను తప్పించి పెద్ద తప్పు చేశారని, ఇప్పుడు రాణిరుద్రమకు టిక్కెట్ ఇచ్చి అధిష్టానం మరో తప్పుచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఎమ్మెల్యే అభ్యర్థులుగా పార్టీ ప్యారాచూట్ లీడర్లకు అవకాశం ఇచ్చిందని, అయితే ఈసారి ఇచ్చిన ప్యారాచూట్ లీడర్ పార్టీ నేతల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తుందన్న కారణంతోనే రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. రాజీనామాలు చేసిన వారిలో ముఖ్య నాయకులు సురువు వెంకటి, బూర విష్ణు, మల్లడపేట భాస్కర్, కంసాల మల్లేశం తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరుతున్న నిమ్మపల్లి నాయకులు

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన వంద మంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సోమవారం డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో తగిన గుర్తింపు లేదన్నారు. ప్రజల్లోకి వెళ్తే అధికారపార్టీ ఇచ్చిన హామీల గురించి ప్రజలు నిలదీస్తున్నారని, వారికి సమాధానం చెప్పలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బండ సత్తయ్య, సాసాల మల్లారెడ్డి, దేవయ్య, తిరుపతి, చిలుక రాజయ్య, లంబ ఎల్లయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



సిరిసిల్లటౌన్: శ్రీశాల శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పది రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ఆశ్వీయుజ శుద్ధ సప్తమి నుంచి ఆశ్వీయుజ బహుళ విదియ వరకు దేవదేవునికి వాహన సేవలు, రథోత్సవం, చక్రస్నానం సేవలను శాస్త్రోక్తంగా జరిపించారు. సోమవారం ఉదయం 5 గంటల నుంచి నాగవల్లి, పుష్పయాగం, దేవత ఉద్వాసన, గ్రామబలి నిర్వహించారు. రాత్రి 9గంటలకు ఏకాంత సేవ జరిపించారు. బ్రహ్మోత్సవాల్లో తుది ఘట్టం ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ ప్రధానార్చకులు కృష్ణమాచారి, ప్రకటించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు ఉప్పుల విఠల్‌రెడ్డి, తీగల శేఖర్‌గౌడ్, నాగుల సంతోష్‌గౌడ్, ఆలయ ఈవో మారుతిరావు, ఏఈవోలు ప్రభాకర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

రాజన్నకు పోటెత్తిన భక్తులు





వేములవాడ: ఎములాడ రాజన్నను సోమవారం 35వేల మంది భక్తులు దర్శించుకున్నారు. దసరా సెలవులు ముగిసినప్పటికీ వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాదిగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా రద్దీగా మారింది. ఆలయ అధికారులు భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసులు, ఎస్పీఎఫ్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరిగింది. వ్యాపారాలు కాస్త ఊపందుకున్నాయి.




సబలెంకా శుభారంభం

మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో గత ఏడాది రన్నరప్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్) శుభారంభం చేసింది. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి లీగ్ మ్యాచ్‌లో సబలెంకా 6-0, 6-1తో మరియా సాకరి (గ్రీస్)పై గెలిచింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఆరు ఏస్‌లు సంధించి, తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. మరో లీగ్ మ్యాచ్‌లో జెస్సికా పెగూలా (అమెరికా) 7-5, 6-2తో రిబాకినా (కజకిస్తాన్)పై విజయం సాధించింది.

అర్జున్‌కు మూడో గెలుపు

గ్రాండ్ స్విస్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో విజయం నమోదు చేశాడు. యూకేలోని ఐల్ ఆఫ్ మ్యాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఐదో రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 68 ఎత్తుల్లో రినాత్ జుమాబయేవ్ (కజకిస్తాన్)పై గెలుపొందాడు. ఐదో రౌండ్ తర్వాత అర్జున్ నాలుగు పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి ఉమ్మడిగా టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.




ఫారూఖీ

అఫ్గాన్ తీన్‌మార్...

- శ్రీలంకపై ఏడు వికెట్లతో సంచలన విజయం
- ఒకే టోర్నీలో మూడు ప్రపంచ చాంపియన్ జట్లను ఓడించిన హష్మతుల్లా బృందం
- బంతితో మెరిసిన ఫారూఖీ
- రహ్మత్ షా, హష్మతుల్లా, అజ్మతుల్లా అర్ధ సెంచరీలు

ఇకపై తమ జట్టును కూనగా పరిగణించాల్సిన అవసరం లేదని అఫ్గానిస్తాన్ చాటి చెప్పింది. మేటి జట్లపై తాము సాధిస్తున్న విజయాలు గాలివాటమేమీ కాదని తమ నిలకడైన ప్రదర్శనతో నిరూపించింది. మూడోసారి వన్డే ప్రపంచకప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఈసారి తమకంటే అన్ని విభాగాల్లో ఎంతో మెరుగైన జట్లను బోల్తా కొట్టిస్తూ ఔరా అనిపించింది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను కంగుతినిపించిన ఉత్సాహంతో 1992 విశ్వవిజేత పాకిస్తాన్ జట్టును కూడా మట్టికరిపించిన అఫ్గానిస్తాన్ జట్టు తాజాగా 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంకను ఓడించి అందర్నీ ఆశ్చర్యపరిచింది.







పుణే: ప్రత్యర్థి జట్టు గత రికార్డు ఎలా ఉంటేనేమి తమదైన రోజున సమష్టిగా గర్జిస్తే అద్భుత ఫలితం సాధించవచ్చని వన్డే ప్రపంచకప్ టోర్నీలో అఫ్గానిస్తాన్ జట్టు మూడోసారి నిరూపించింది. భారీ అంచనాలు పెట్టుకోకుండా ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ మూడో సంచలన విజయంతో అలరించింది. 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంక జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో హష్మతుల్లా షాహిది నాయకత్వంలోని అఫ్గానిస్తాన్ జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలిచి అబ్బురపరిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (60 బంతుల్లో 49; 5 ఫోర్లు), కెప్టెన్ కుశాల్ మెండిస్ (50 బంతుల్లో 39; 3 ఫోర్లు), సమరవిక్రమ (40 బంతుల్లో 36; 3 ఫోర్లు), తీక్షణ (31 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫజల్‌హక్ ఫారూఖీ (4/34) శ్రీలంక జట్టును దెబ్బ తీశాడు. ఒకదశలో 134/2తో పటిష్టస్థితిలో కనిపించిన శ్రీలంక నిసాంక అవుటయ్యాక తడబడింది. 107 పరుగుల తేడాలో ఏడు వికెట్లు కోల్పోయింది. కెరీర్‌లో 100వ వన్డే ఆడిన రషీద్ ఖాన్ ఒక వికెట్ తీయగా, మరో స్పిన్నర్ ముజీబ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం 242 పరుగుల విజయ లక్ష్యాన్ని అఫ్గానిస్తాన్ 45.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ గుర్బాజ్ (0) డకౌట్‌కాగా... రహ్మత్ షా (74 బంతుల్లో 62; 7 ఫోర్లు), హష్మతుల్లా షాహిది (74 బంతుల్లో 58 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (63 బంతుల్లో 73 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో అఫ్గానిస్తాన్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. హష్మతుల్లా, అజ్మతుల్లా నాలుగో వికెట్‌కు అజేయంగా 111 పరుగులు జోడించడం విశేషం.

ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడిపోయిన అఫ్గానిస్తాన్... రెండో మ్యాచ్‌లో 69 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను ఓడించి బోణీ కొట్టింది. మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 149 పరుగుల తేడాతో ఓడిపోయి... నాలుగో మ్యాచ్‌లో విజృంభించి 1992 విశ్వవిజేత పాకిస్తాన్‌పై ఏకంగా 8 వికెట్ల తేడాతో గెలిచింది. అనంతరం అదే ఉత్సాహంతో శ్రీలంకను కూడా మట్టికరిపించి అఫ్గానిస్తాన్ పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. మూడోసారి వన్డే వరల్డ్‌కప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఒకే ప్రపంచకప్‌లో మూడు విజయాలు సాధించడం ఇదే ప్రథమం. 2015 ప్రపంచకప్‌లో ఒక మ్యాచ్‌లో నెగ్గిన అఫ్గానిస్తాన్... 2019 ప్రపంచకప్‌లో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. ఈ ప్రపంచకప్‌లో మాత్రం అఫ్గానిస్తాన్ తమ కంటే మెరుగైన జట్లకు చెమటలు పట్టిస్తోంది. ఈ టోర్నీలో అఫ్గానిస్తాన్ మిగిలిన మూడు మ్యాచ్‌లను నెదర్లాండ్స్ (నవంబర్ 3న), ఆస్ట్రేలియా (నవంబర్ 7న), దక్షిణాఫ్రికా (నవంబర్ 10న) జట్లతో ఆడుతుంది.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) గుర్బాజ్ (బి) అజ్మతుల్లా 46; దిముత్ కరుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) ఫారూఖీ 15; కుశాల్ మెండిస్ (సి) నజీబుల్లా (సబ్) (బి) ముజీబ్ 39; సమరవిక్రమ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముజీబ్ 36; అసలంక (సి) రషీద్ ఖాన్ (బి) ఫారూఖీ 22; ధనంజయ డిసిల్వా (బి) రషీద్ ఖాన్ 14; ఏంజెలో మాథ్యూస్ (సి) నబీ (బి) ఫారూఖీ 23; చమీర (రనౌట్) 1; తీక్షణ (బి) ఫారూఖీ 29; కసున్ రజిత (రనౌట్) 5; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 241.** **వికెట్ల పతనం:** 1-22, 2-84, 3-134, 4-139, 5-167, 6-180, 7-185, 8-230, 9-239, 10-241. **బౌలింగ్:** ముజీబ్ ఉర్ రెహ్మాన్ 10-0-38-2, ఫజల్లహ్ ఫారూఖీ 10-1-34-4, నవీన్ ఉల్ హక్ 6.3-0-47-0, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 7-0-37-1, రషీద్ ఖాన్ 10-0-50-1, నబీ 6-0-33-0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: రహ్మానుల్లా గుర్బాజ్ (బి) మదుషంక 0; ఇబ్రహీమ్ జద్రాన్ (సి) కరుణరత్నే (బి) మదుషంక 39; రహ్మత్ షా (సి) కరుణరత్నే (బి) రజిత 62; హష్మతుల్లా షాహిది (నాటౌట్) 58; అజ్మతుల్లా (నాటౌట్) 73; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (45.2 ఓవర్లలో మూడు వికెట్లకు) 242.** **వికెట్ల పతనం:** 1-0, 2-73, 3-131. **బౌలింగ్:** మదుషంక 9-0-48-2, రజిత 10-0-48-1, మాథ్యూస్ 3-0-18-0, చమీర 9.2-0-51-0, తీక్షణ 10-0-55-0, ధనంజయ డిసిల్వా 4-0-21-0.

ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్ X బంగ్లాదేశ్
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	6	6	0	12	1.405
దక్షిణాఫ్రికా	6	5	1	10	2.032
న్యూజిలాండ్	6	4	2	8	1.232
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
అఫ్గానిస్తాన్	6	3	3	6	-0.718
శ్రీలంక	6	2	4	4	-0.275
పాకిస్తాన్	6	2	4	4	-0.387
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	6	1	5	2	-1.338
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

అనీశ్ డబుల్ ధమాకా


కాంస్య పతకంతోపాటు పారిస్ ఒలింపిక్ బెర్త్ సొంతం



చాంగ్వాన్ (దక్షిణ కొరియా): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. సోమవారం జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత యువ షూటర్ అనీశ్ భన్వాలా కాంస్య పతకం సాధించాడు. ఆరుగురి మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 21 ఏళ్ల అనీశ్ 28 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంతో ముగించాడు. ఈ ప్రదర్శనతో అనీశ్ వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను కూడా ఖరారు చేసుకున్నాడు. ఇప్పటి వరకు షూటింగ్‌లో భారత్‌కు 12 ఒలింపిక్ బెర్త్‌లు లభించాయి. మరోవైపు పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో హైదరాబాద్ షూటర్ కైనన్ షెనాయ్, జొరావర్ సింగ్ సంధూ, పృథ్వీరాజ్ తొండైమన్‌లతో కూడిన భారత జట్టుకు రజత పతకం దక్కింది. కైనన్, జొరావర్, పృథ్వీరాజ్ బృందం 341 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు ఈ టోర్నీలో భారత్ 30 పతకాలు సాధించింది.

వెర్‌స్టాపెన్ రికార్డు

ఈ సీజన్‌లో 16వ విజయం



మెక్సికో సిటీ: ఇప్పటికే ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకున్నప్పటికీ... రెడ్ బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ మాత్రం ఫార్ములావన్-2023 సీజన్‌లో ఎదురులేకుండా దూసుకుపోతున్నాడు. మెక్సికో గ్రాండ్‌ప్రి రేసులో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును మూడో స్థానం నుంచి ప్రారంభించిన వెర్‌స్టాపెన్ తొలి మలుపు వద్ద ప్రత్యర్థి డ్రైవర్లను ఓవర్‌టేక్ చేసి ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత రేసు చివరిదాకా ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. వెర్‌స్టాపెన్ 71 ల్యాప్‌లను అందరికంటే వేగంగా 2 గంటల 2 నిమిషాల 30.814 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది 16వ గెలుపు కావడం విశేషం. తద్వారా ఒకే ఏడాది అత్యధిక ఎఫ్1 రేసుల్లో గెలిచిన డ్రైవర్‌గా తన పేరిటే ఉన్న రికార్డును వెర్‌స్టాపెన్ బద్దలు కొట్టాడు. గత ఏడాది వెర్‌స్టాపెన్ 15 రేసుల్లో గెలుపొందాడు. ఓవరాల్‌గా వెర్‌స్టాపెన్ కెరీర్‌లో ఇది 51వ విజయం. ఈ క్రమంలో కెరీర్‌లో అత్యధిక ఎఫ్1 విజయాలు సాధించిన డ్రైవర్ల జాబితాలో నాలుగో స్థానంలో ఉన్న అలైన్ ప్రాస్ట్ (ఫ్రాన్స్) సరసన నిలిచాడు.

లెక్క సరిచేసిన భారత్



రాంచీ: ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' సాధించింది. చైనా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-1 గోల్స్ తేడాతో నెగ్గింది. భారత్ తరఫున దీపిక (15వ ని.లో), సలీమా టెటె (26వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. చైనా జట్టుకు జాంగ్ జియాకి (41వ ని.లో) ఒక గోల్ అందించింది. ఈ గెలుపుతో ఇటీవల హాంగ్జౌ ఆసియా క్రీడల్లో చైనా జట్టు చేతిలో సెమీఫైనల్లో ఎదురైన ఓటమికి భారత్ బదులు తీర్చుకుంది.

జ్యోతి యర్రాజీకి స్వర్ణం



పనాజీ: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు మూడో స్వర్ణ పతకం లభించింది. సోమవారం జరిగిన అథ్లెటిక్స్ ఈవెంట్‌లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి యర్రాజీ చాంపియన్‌గా అవతరించింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి 13.22 సెకన్లలో అందరికంటే వేగంగా ఫైనల్ రేసును ముగించి అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు తెలంగాణ ఖాతాలో 11వ పతకం చేరింది. మహిళల స్విమ్మింగ్ 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో వ్రితి అగర్వాల్ రజత పతకం సాధించింది.

సినిమా

అమ్మాడీ...


● మృణాల్ ఠాకూర్, నాని

మాట రూపంలో కాకుండా ఇంకాస్త ఎక్కువగా ప్రేమను వ్యక్తపరచాలనుకున్నప్పుడు హీరో హీరోయిన్ పాట పాడుకోవడం చూస్తుంటాం. మృణాల్ ఠాకూర్‌పై నాని అలాంటి ప్రేమనే వ్యక్తపరిచారు. ప్రేమను వ్యక్తపరుస్తూ 'అమ్మాడీ...' అంటూ ఆమెను ఉద్దేశించి పాడారు నాని. 'హాయ్ నాన్న' చిత్రంలోని ఈ పాటను నవంబర్ 4న రిలీజ్ చేయనున్నారు. నాని, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'హాయ్ నాన్న'. నాని కుమార్తెగా బేబీ కియారా ఖన్నా నటించింది. ఈ చిత్రం కోసం హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన పాటల్లో తొలి పాట 'సమయమా..', రెండో పాట 'గాజు బొమ్మ..'ను ఇప్పటికే రిలీజ్ చేశారు. 'అమ్మాడీ...' మూడో పాట. నాని, మృణాల్ మధ్య సాగే రొమాంటిక్ సాంగ్ ఇది అని యూనిట్ పేర్కొంది. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డా. విజయేందర్ రెడ్డి తీగల ఈ చిత్రాన్ని నిర్మించారు. డిసెంబర్ 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్ ఐఎస్‌సీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సతీష్ ఈవీవీ.

కౌంట్ డౌన్ స్టార్ట్


● వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, బేబీ సారా, జయప్రకాశ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న 'సైంధవ్' జనవరి 13న సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. కాగా ఇది వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రం కావడం విశేషం. తాజాగా 'సైంధవ్' విడుదలకు కౌంట్ డౌన్ స్టార్ట్ చేస్తూ మేకర్స్ ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ''పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న చిత్రం 'సైంధవ్'. సినిమా విడుదలకు ఇంకా 75 రోజులు ఉంది. సంతోష్ నారాయణన్ ఈ చిత్రం కోసం అద్భుతమైన ఆల్బమ్ సిద్ధం చేశారు. త్వరలో మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేయబోతున్నాం'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి సహనిర్మాత: కిశోర్ తాళ్లూరు, కెమెరా: యస్. మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం (వెంకట్).

మమ్మల్ని సినిమా కలిపింది - విజయ్ దేవరకొండ


● బ్రహ్మానందం, విజయ్ దేవరకొండ, తరుణ్ భాస్కర్, సాయికృష్ణ

''నేను, దర్శకులు నాగ్ అశ్విన్, తరుణ్ భాస్కర్, సందీప్ రెడ్డి వంగా వేర్వేరు చోట్ల పెరిగాం. మా నేపథ్యాలు వేరు.. మమ్మల్ని సినిమా కలిపింది. 'పెళ్ళి చూపులు'తో నన్ను హీరోగా పరిచయం చేశాడు తరుణ్ భాస్కర్. ఆ తర్వాత 'ఈ నగరానికి ఏమైంది'తో కొందరు కొత్తవాళ్లకు కెరీర్ ఇచ్చాడు. ఇప్పుడు 'కీడా కోలా'లోనూ ప్రతిభ ఉన్న కొత్త వాళ్లు కనిపిస్తున్నారు. తరుణ్‌కి తనపై, తన కథలపై చాలా నమ్మకం. ఈ విషయంలో అతన్ని గౌరవిస్తాను. ఇండస్ట్రీకి దొరికిన అదృష్టం తను'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కీడా కోలా'. రానా సమర్పణలో కె. వివేక్ సుధాంశు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ దేవరకొండ మాట్లాడుతూ–''తరుణ్ భాస్కర్‌పై ఉన్న నమ్మకంతో చెబుతున్నా.. 'కీడా కోలా' మజా ఇస్తుంది. తర్వలో మా ఇద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుంది'' అన్నారు. సీనియర్ నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ–''డైరెక్టర్ జంధ్యాలగారి సినిమాలు చేస్తున్నప్పుడు వినోదం ఎంత హాయిగా పండిందో మళ్లీ 'కీడా కోలా'కి అలాంటి అనుభూతి కలిగింది'' అన్నారు. ''నా 'పెళ్ళి చూపులు, ఈ నగరానికి ఏమైంది' చిత్రాల విడుదలప్పుడు చిన్న భయం ఉండేది. ప్రేక్షకుల స్పందన తెలుసుకునేందుకు థియేటర్ బయటే తిరిగేవాడిని. 'కీడా కోలా' విషయంలో ఆ భయం లేదు'' అన్నారు తరుణ్ భాస్కర్. ''రెండు గంటల పాటు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు'' అన్నారు నిర్మాతలు సాయికృష్ణ గద్వాల్, శ్రీపాద్.

ప్రేక్షకులకు పది రెట్ల థ్రిల్ గ్యారంటీ - అనిల్ విశ్వనాథ్



''మా ఊరి పొలిమేర' తొలి భాగం ఓటీటీలో రిలీజ్ కావడంతో ప్రేక్షకుల స్పందన పెద్దగా తెలియలేదు. సినిమా చూసి, చాలామంది బాగుందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. శుభలేఖ సుధాకర్‌గారు ఫోన్ చేసి, 'దర్శకుడిగా నీకు మంచి భవిష్యత్ ఉంటుంది' అని చెప్పడంతో నాపై నాకు మరింత నమ్మకం పెరిగింది'' అని డైరెక్టర్ డా. అనిల్ విశ్వనాథ్ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల, బాలాదిత్య, రాకేందు మౌళి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర-2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 3న రిలీజవుతోంది. ఈ సందర్భంగా అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర' ఎక్కడ ముగిసిందో అక్కడి నుంచే రెండో భాగం మొదలవుతుంది. తొలి భాగం హిట్టవ్వడంతో సీక్వెల్‌పై అంచనాలు పెరిగాయి. అందుకే పార్ట్ 2 స్క్రీన్‌ప్లేను మరింత బలంగా తయారు చేశాను. తొలి భాగంతో పోల్చితే ప్రేక్షకులు దాదాపు పది రెట్ల థ్రిల్ ఫీలవుతారు. వంశీ నందిపాటిగారి సహకారంతో మా చిత్రాన్ని ఘనంగా రిలీజ్ చేస్తున్నాం. 'బన్నీ' వాసుగారికి నచ్చడంతో మా సినిమా పెద్ద రేంజ్‌కు వెళ్లింది. 'మా ఊరి పొలిమేర 3' కూడా ఉంటుంది. అంతకన్నా ముందు వేరే జానర్‌లో ఓ సినిమా చేస్తా'' అన్నారు.

ప్రేమకథ షురూ


● నాగచైతన్య, అలేఖ్య హారిక, సంతోష్ శోభన్

సంతోష్ శోభన్, అలేఖ్య హారిక జంటగా కొత్త సినిమా షురూ అయింది. సుమన్ పాతూరి దర్శకత్వంలో అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్‌పై ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి డైరెక్టర్ చందూ మొండేటి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో నాగచైతన్య క్లాప్ కొట్టగా, డైరెక్టర్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహించారు. డైరెక్టర్ హరీష్ శంకర్, నిర్మాత రవిశంకర్ యూనిట్‌కి స్క్రిప్ట్ అందించగా, హీరో సుశాంత్, దర్శకులు హను రాఘవపూడి, రాహుల్ సంకృత్యాన్ యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో మంచి ప్రేమకథ ఉంటుంది'' అన్నారు. ''నా మనసుకు దగ్గరైన కథ ఇది. నేను, ఎస్‌కేఎన్, సందీప్ రాజ్, అలేఖ్య.. మేమంతా ఫ్రెండ్స్. ఈ సినిమా వారితో కలిసి చేస్తుండటంతో మరింత బాధ్యతగా భావిస్తున్నా'' అన్నారు సాయి రాజేశ్. ''ఈ సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ ఇచ్చిన నా ఫ్రెండ్ సాయి రాజేశ్‌కు థ్యాంక్స్'' అన్నారు సుమన్ పాతూరి. ''హీరోయిన్‌గా చేయాలనే నా కల ఈ చిత్రంతో నెరవేరుతోంది'' అన్నారు అలేఖ్య హారిక. ''తెలుగు అమ్మాయిలను ప్రోత్సహించాలనే నా సినిమాల్లో తెలుగు అమ్మాయిలనే హీరోయిన్‌గా తీసుకుంటున్నాను'' అన్నారు ఎస్‌కేఎన్. ఈ చిత్రానికి కెమెరా: అస్కర్, సంగీతం: విజయ్ బుల్గానిన్, సహనిర్మాతలు: ధీరజ్ మొగిలినేని, రమేశ్ పెద్దింటి.

కథని నమ్మి చేశాం - శ్రీరామ్


● అవసరాల, ఖుషీ, శ్రీరామ్, సాయికిరణ్, కోన వెంకట్

''పిండం అనేది జననానికి, మరణానికి సంబంధించినది. ఈ 'పిండం' సాయి కిరణ్ లాంటి ప్రతిభగల దర్శకుడి పుట్టుకకు (ఇండస్ట్రీలో) కారణం కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు రచయిత, నిర్మాత కోన వెంకట్. సాయికిరణ్ దైదా దర్శకత్వంలో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' ఉపశీర్షిక. కళాహి మీడియాపై యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్నారు కోన వెంకట్. మరో అతిథి బీవీఎస్ రవి (రచయిత, దర్శకుడు) మాట్లాడుతూ– ''ఈ సినిమా టీజర్, నిర్మాణ విలువలు బాగున్నాయి. తప్పకుండా విజయం సాధిస్తుంది'' అన్నారు. శ్రీరామ్ మాట్లాడుతూ– ''కథని నమ్ముకొని చేసిన చిత్రం 'పిండం'. ఈ సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో నటించిన ఇద్దరు పిల్లల నటన చూసి నేనే ఆశ్చర్యపోయాను. ఇలాంటి మంచి సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''కళాహి మీడియా బ్యానర్‌పై 'పిండం'లాంటి మంచి సినిమాలు మరిన్ని చేస్తాం'' అన్నారు యశ్వంత్ దగ్గుమాటి. ''ఇదొక ఇంటెన్స్ హారర్ ఫిల్మ్'' అన్నారు సాయి కిరణ్ దైదా. సంగీత దర్శకుడు కృష్ణ సౌరభ్ సూరంపల్లి, కెమెరామేన్ సతీష్ మనోహర్ తదితరులు మాట్లాడారు.

ఒకేసారి ఐదు సినిమాలు ఒక సంచలనం - బ్రహ్మానందం


● అచ్యుతరావు, బ్రహ్మానందం, ఉపేంద్ర

''ఒక సినిమా తీయడానికే ఇబ్బంది పడుతున్న ఈ రోజుల్లో ఒకేసారి ఐదు సినిమాలు తీస్తుండటం ఓ సంచలనం. తన కుమారుడు ఉపేంద్రని హీరోగా పరిచయం చేయడంతో పాటు ఒకేసారి అతనితో ఐదు సినిమాలు తీస్తున్న అచ్యుతరావుకి అభినందనలు. దీనివల్ల పరిశ్రమను నమ్ముకున్నవారికి అవకాశాలు ఇచ్చి, భోజనం పెట్టినట్లవుతుంది. 'ఉపేంద్రగాడి అడ్డా' మంచి హిట్టవ్వాలి'' అని సీనియర్ నటుడు బ్రహ్మానందం అన్నారు. కంచర్ల ఉపేంద్ర, సావిత్రీ కృష్ణ జంటగా ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వం వహించిన చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్‌పై కంచర్ల అచ్యుతరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరై, 'ఉపేంద్రగాడి అడ్డా' ట్రైలర్‌ను, '1920 భీమునిపట్నం' పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే ఉపేంద్ర హీరోగా ఇదే బ్యానర్‌లో తీస్తున్న ఐదు సినిమాల టీజర్లను విడుదల చేశారు. కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో నవంబర్ నుంచి ప్రతీ నెల ఒక సినిమాను విడుదల చేయబోతున్నాం'' అన్నారు. ''నా పుట్టిన రోజుకి ఇది వెలకట్టలేని పెద్ద బహుమతి'' అన్నారు కంచర్ల ఉపేంద్ర. ''సోషల్ మీడియా నేటి సమాజాన్ని ఎంతగా ప్రభావితం చేస్తోందో మా చిత్రం ద్వారా చూపిస్తున్నాం'' అన్నారు ఆర్యన్ సుభాన్ ఎస్‌కే. హీరోయిన్ సావిత్రీ కృష్ణ, సహనిర్మాతలు కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత పాల్గొన్నారు.

అంబాజీపేట సంతృప్తి ఇచ్చింది - సుహాస్


● సుహాస్, శివానీ నాగరం

''అంబాజీపేట మ్యారేజి బ్యాండు' ఫ్రెష్ సబ్జెక్ట్. సినిమా కొత్తగా ఉంటుంది. నటుడిగా నాకు సంతృప్తినిచ్చింది. ఒక మంచి సినిమా చూశామనే అనుభూతితో ప్రేక్షకులు థియేటర్స్ నుంచి బయటకు వస్తారు'' అని సుహాస్ అన్నారు. దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో సుహాస్, శివానీ నాగరం జంటగా నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. జీఏ2 పిక్చర్స్, మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ నిర్మించాయి. ఈ చిత్ర సంగీతదర్శకుడు శేఖర్ చంద్ర స్వరపరచిన 'గుమ్మా....' అంటూ సాగే తొలి పాటను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దుశ్యంత్ కటికినేని మాట్లాడుతూ– ''ఈ పాటకి రెహ్మాన్ మంచి లిరిక్స్ ఇచ్చారు. ఈ సినిమాలోని పాటలన్నీ బాగుంటాయి'' అన్నారు. ''జనవరి నెలాఖరులో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు ధీరజ్ మొగిలినేని. ''మంచి సినిమాలు ఎప్పుడొచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తారు. 'అంబాజీపేట..' హిట్ కావాలి'' అన్నారు నిర్మాత ఎస్‌కేఎన్. నటులు జగదీశ్, నితిన్, డ్యాన్స్ మాస్టర్ మోయిన్ తదితరులు మాట్లాడారు.